యుద్ధానికి సై!



28న తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి భారీ బహిరంగ సభ.. చంద్రబాబు-పవన్ హాజరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై యుద్ధం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన తొలి ఉమ్మడి బహిరంగ సభకు వేదిక ఖరారైంది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం జాతీయ రహదారి సమీపంలోని ప్రత్తిపాడులో ఈ నెల 28వ తేదీన నిర్వహించేందుకు విజయవాడలో గురువారం జరిగిన ఉభయపార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో నేతల నిర్ణయించారు. ఈ సభకు తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. వాస్తవానికి ఉమ్మడి తొలి సభ ఫిబ్రవరి 14న పాలకొల్లు వేదికగా జరగాల్సి వుంది. పొత్తుల భాగస్వామ్యంలోకి బీజేపీ కూడా చేరుతున్న క్రమంలో ఇది వాయిదా పడింది. సభ జరిగే నాటికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులపై పూర్తి స్పష్టత వస్తుందని భీమవరం పర్యటనలో ఇప్పటికే జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టత ఇచ్చారు.


తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని

సువిశాల మైదానం

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభకు ప్రత్తిపాడు జాతీయ రహదారికి ఆనుకుని వున్న 25 ఎకరాల ఎన్‌కే గ్రౌండ్స్‌ను ప్రాథమికంగా నిర్ధారించారు. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి దాదాపు ఐదు లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రచిస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో పాటు, ఇరు పార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు సభలో పాల్గొంటారు. మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో జిల్లాలో తెలుగుదేశం, జనసేన పార్టీలు అప్రమత్తమయ్యాయి. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ గురువారం తాడేపల్లిగూడెం విచ్చేశారు. స్థానిక తెలుగుదేశం నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, టీడీపీతో సమావేశం అయ్యారు. ఉమ్మడి సభకు ఉభయ గోదావరి జిల్లాలతోపాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి భారీగా కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ సభ నుంచే టీడీపీ, జనసేన ఉమ్మడిగా ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నాయి తెలుగుదేశం-జనసేన పొత్తుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇరు పార్టీల్లోనూ జోష్ నెలకొంది. రెండు జిల్లాల్లో అన్ని స్థానాలు తమ వేనంటూ ఇరు పార్టీల నేతలు ఇప్పటికే కుండ బద్దలు కొడుతున్నారు. జనంలోకి మరింత బలంగా వెళ్లేందుకు ఈ సభ దోహదపడనుందని భావిస్తున్నారు.


ప్రత్తిపాడులో జరిగే టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు తదితరులు

వైసీపీని సాగనంపేందుకు.. : పితాని

తాడేపల్లిగూడెం వేదికగా తొలిసారిగా ఉమ్మడి సభ నిర్వహిస్తాయని మాజీ మంత్రి పితాని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే కాకుండా, మైనింగ్, ఇసుక, లిక్కర్ మాఫియాలతో అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ఉమ్మడి రాజకీయ వేదిక దోహదపడుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్‌లు భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తారని పితాని వివరించారు. తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పురందేశ్వరి, తపనా చౌదరి

27న ఏలూరులో బీజేపీ ప్రజా పోరు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు.. జగన్ వైఫల్యాలను నిలదీస్తాం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):'ప్రజా పోరు పేరిట ఈ నెల 27న ఏలూరులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. ఈ సభకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కానున్నారు. క్లస్టర్‌లోని ఉభయ గోదావరి, ఏలూరు, కాకినాడ, అమలాపురం జిల్లాల పరిధిలోని బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో నేరుగా ఆయన భేటీ అవుతారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రకటించారు. ఏలూరులోని సభా స్థలిని గురువారం పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మిగతా నేతలు పరిశీలించి, మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రజా పోరులో వైసీపీ పాలనలో జరిగే మోసాలను ప్రజల ముందుంచి నిలదీస్తామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జగన్ నిలబెట్టుకోలేదని, మద్య నిషేధం అన్నా ఆదెక్కడా అమలు జరగలేదని, రైతులను ఆదుకునేందుకు 3 వేల కోట్లతో ధర స్థిరీకరణ నిధి ఏర్పాటంటూ వచ్చి అబద్ధాలాడాడని, రైతులను మోసం చేశాడని పురందేశ్వరి విరుచుకుపడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులను ఆదుకునేందుకు వీలుగా నాలుగు వేల కోట్లతో విపత్తుల నిర్వహణా నిధి ఏర్పాటు చేస్తామన్నా అదీ జరగలేదన్నారు. రైతుల రక్షణకు బీమాకు రాష్ట్ర వాటా చెల్లించకపోవడం వల్ల అది రైతులకు కాకుండా పోయిందని, దీనికి ప్రధాన కారకులు సీఎం జగన్ అని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణ ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శరణాల మాలతీ రాణి పాల్గొన్నారు.


ద్వారకా తిరుమల చిన వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణం 7లో..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నివేదికలివ్వండి

భీమవరం, ఫిబ్రవరి 22 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను, ప్రాంతాలను గుర్తించి వెంటనే నివేదికను అందజేయాలని సెక్టార్ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టర్, ఏఎస్పీలు వి.భీమారావు, ఏటీపీ రవికుమార్ కలిసి ఆర్డీవోలు, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీటిని గుర్తించి సంబంధిత నివేదికను ఈ నెల 28లోగా అందజేయా లన్నారు. జిల్లాలో 1,461 పోలింగ్ కేంద్రాలలో 184 సమస్యాత్మక, 215 అతి సమస్యాత్మక కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ నివేదికలను అందజేయాలని ఆదేశించారు.

పరీక్షలకు ముందస్తు ఏర్పాట్లు

జిల్లాలో వివిధ పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి గురువారం ఇంటర్మీడియట్, టెన్త్, డీఎస్సీ టెట్ పరీక్షలపై కలెక్టర్‌లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్‌గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలు నిర్వహణపై విద్య, వైద్య, రవాణా, విద్యుత్, పోలీసు తదితర శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.


మూడు డ్యామ్‌ల వద్ద నిలిచిన తూడు, నీరులేక పొలం ఇలా..

సాగు నీరందదు.. వంతు వదలరు

వీరవాసరం, ఫిబ్రవరి 22 : వీరవాసరం పశ్చిమ కాలువ ఆయకట్టు శివారు ప్రాంతమైన మత్స్యపురి భూములకు దాళ్వా ప్రారంభంలోనే సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ పరిధిలో వీరవాసరం వద్ద ఉన్న మూడు డ్యామ్‌ల ప్రాంతం నుంచి మత్స్యపురి, బొబ్బనపల్లి, మెంటేపూడి భూములకు సాగు నీరు వంతుల వారీగా వెళుతుంది. వాస్తవంగా 24 గంటలపాటు వంతు వేసి అందించాల్సిన నీటిని 48 గంటలు దాటుతున్నా రావడం లేదు. దీనివల్ల ఎగువ నుంచి వచ్చే తూడు నిలిచిపోయి నీటిని ముందుకు సాగకుండా అడ్డుపడుతోంది. తూడును తొలగించి గట్లపై వేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నాట్లు వేసి 25 రోజులు దాటింది. మరో పది రోజుల్లో వరి పొట్ట దశకు చేరే స్థితిలో సాగు నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రేపు హైకోర్టు న్యాయమూర్తులు రాక

నరసాపురం, ఫిబ్రవరి 22: కోర్టు ప్రాంగణంలో శనివారం సీనియర్ న్యాయవాది స్వర్గీయ అందే బావన్న చిత్రపట ఆవిష్కరణకు ఐదుగురు హైకోర్టు న్యాయమూర్తులు విచ్చేస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా దానయ్య నాయుడు, ఆర్‌కె బాబ్జీలు తెలిపారు. ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ జడ్జి ఆకులవెంకటస్వామి, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ జయసూర్య జస్టిస్ మల్లిఖార్జున రావు, జస్టిస్ హరినాథ్‌లు హాజరవుతున్నారన్నారు. వీరితో పాటు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తులు డీఎస్ఆర్ వర్మ, సోమయాజులు, భవానిప్రసాద్‌లు కూడా విచ్చేస్తున్నట్లు తెలిపారు.

జనసేనలో చేరుతున్నా

నా తమ్ముడు కూడా నా వెంటే : మాజీ మంత్రి కొత్తపల్లి

నరసాపురం, ఫిబ్రవరి 22: గత కొంతకాలంగా కొత్తపల్లి సుబ్బా రాయుడు పార్టీలో చేరి కపై వస్తున్న ఊహాగానాలకు గురువారం ఆయన క్లారిటీ ఇచ్చారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన సోదరుడు జానకీరామ్ కూడా జనసేనలో చేరుతారన్నారు. ఈ నెలాఖరులోపు పవన్ సమక్షంలోనే తన మద్దతుదారులతో కలిసి పార్టీ కండువాను కప్పుకోనున్నట్లు స్పష్టం చేశారు. గుత్తుల బలిచక్రవర్తి, వైఎస్ బాబులు, మురళీ, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న కొత్తపల్లి


కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తప్పుడు పోస్టులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం/ఉంగుటూరు, ఫిబ్రవరి 22: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజును అసభ్య పదజాలంతో దూషించడమే గాక సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి అవమానిస్తున్న పులివెందులకు చెందిన రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మండలంలోని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ నాయకులు స్టేషన్‌కు వచ్చి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, చింతల వెంకటరమణ, నల్లూరి గోపి, దుర్గాప్రసాద్, సిద్దూ, సంకట రమేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాపల చినబాబు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకట్రావు ఉన్నారు. ఉంగుటూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం, నాయకులు దిడ్ల శ్రీనివాసరావు, ఉప్పాటి పుల్లారావు తదితరులు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 22 : దేశానికి మానవ వనరులే కీలక ఆస్తి అని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ సురేష్‌నాయక్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఆటిట్యూడ్ అండ్ బిహేవియర్ డవలప్‌మెంట్ అనే అంశం పై గురువారం ఏపీ నిట్ ప్రాంగణంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి అధ్యక్షత వహించగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ దేశ ప్రగతి లో పరిశోధన, అభివృద్ధి పాత్ర ఎంతో కీలకమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలను విద్యార్థులందరూ ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలన్నారు. శాస్త్రవేత్తలు ఒక వైజ్ఞానిక పరిశోధన కోసం ప్రయోగ శాలలో ఏళ్ళ తరబడి అంకిత భావంతో కృషి చేస్తారన్నారు. భారత దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త జగదీష్‌చంద్రబోస్ తన పరిశోధనలతో ఎంతో కీర్తిని గడించారని, అటు వంటి వారి స్ఫూర్తితో విద్యార్థులు విభిన్నంగా ఆలోచిస్తూ కొత్త పరిశోధనలను విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వీసందీప్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, డాక్టర్ సంతోష్, డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ సుదర్శన దీపలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్‌నాయక్

ఈ..సమస్యకి పరిష్కారం లేదా ?

తరచూ సర్వర్ డౌన్.. నిలిచిపోతున్న రిజిస్ట్రేషన్‌లు

ఆచంట, ఫిబ్రవరి 22: రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా తీసుకువచ్చిన 2.0 విధానంతో ప్రతీ రోజూ ఏదో ఒక సమస్య తలెత్తు తూనే ఉంది. రిజిస్ట్రేషన్‌లు సజావుగా జరగడానికి వీలు లేకుండా ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. దీంతో కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి గంటల కొద్దీ వేచి ఉన్నప్పటికి ఒక్కసారి సర్వర్ సమస్య తలెత్తడంతో కక్షిదారులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. గురువారం దస్తావేజులకు సంబంధించి ఈకేవైసీలు అయినప్పటికి క్యాష్ రిసిప్ట్‌లో దానికి సంబంధించి డేటా రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సమస్య అలాగే ఉండిపోవడంతో జిల్లాలో ఎక్కడా కూడా రిజిస్ట్రేషన్‌లు జరగ లేదని సమాచారం. ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల ద్వారా ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని కక్షిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలానా రూపంలో డబ్బులు కడుతున్నామని ఆ డబ్బులు వెంటనే ప్రభుత్వ అకౌంటుకు వెళ్ళిపోతున్నాయని అంటు న్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌లు విషయంలో అనేక నిబంధనలు పెట్టిన కారణంగానే కక్షిదారులు అవస్థలు పడు తూనే ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్‌లు సజావుగా అయ్యేలా చూడాలని కక్షిదారులు కోరుతున్నారు.


రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్యాష్ డేటా చూపని దృశ్యం

తాళ్ళపూడి మండలంలో పులి సంచారం

రంగంలోకి శ్రీశైలం టైగర్ రిజర్వు అటవీశాఖ బృందం

పోలవరం, ఫిబ్రవరి 22 : రెండు నెలలుగా ఏజెన్సీ పరిసర ప్రజానీకానికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్న పెద్దపులి గురువారం తాళ్ళపూడి మండలానికి చేరుకుంది. బుధవారం దేవరపల్లి మండలంలో అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీ పరిసరాల్లో పులి సంచారంపై అటవీశాఖ అధికా రులకు సమాచారం అందడంతో ఆ ప్రాంతానికి వెళ్ళి పాదముద్రలు పరిశీలిం చారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. తాజాగా తాళ్ళపూడి మండలం మల కపల్లి గ్రామంలో వరి పొలాల్లో పులి పాద ముద్రలు గుర్తించినట్లుగా రైతులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు శ్రీశైలం టైగర్ రిజర్వు అడవుల్లో పని చేసిన ప్రత్యేక బృందంతో పరిశీలించారు. పులి గమనంపై దృష్టి సారించి పులిని అనుసరించే దిశగా చర్యలు చేపట్టినట్లు అటవీక్షేత్రాధికారి దావీదురాజు తెలిపారు. తాళ్ళపూడి మండలంలో తిరుగుడుమెట్ట, పెద్దేవం, రావూరుపాడు, మలకపల్లి, వెంకటాయపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పులి సంచరించే ప్రాంతాల్లో పశువు లను మేపడం, కట్టడం చేయరాదని, పులి ఆనవాళ్ళు కనిపిస్తే అటవీ అధికా రులకు సమాచారమివ్వాలన్నారు పులి సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 180042 55909 లేదా ఏలూరు అటవీక్షేత్రాధికారి నంబర్94408 10222కు తెలిపాలని కోరారు.


పరిశీలిస్తున్న అధికారులు



పాలకొల్లులో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఐక్యత చాటుతున్న జర్నలిస్టులు ...నరసాపురంలో డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న విలేకరులు

సంఘటితంగా పోరాడాలి

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశంలో సభ్యులు

జర్నలిస్టులపై దాడులకు నిరసన

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి, 22 : పాత్రికేయులపై దాడులను పాత్రికేయులందరూ సంఘటితంగా ప్రతిఘటించాలని ఏపీయూడబ్ల్యూజే పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు విసాయిబాబా, గజపతి వరప్రసాదులు కోరారు. పాలకొల్లులో గురువారం పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ దాడులకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీనెలా జిల్లా కార్యవర్గ సమావేశంలో నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించాలని అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌లు ఇవ్వాలని. ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని, విద్యా రాయితీ ఉత్తర్వులు ఇవ్వాలని, కమిటీ తరుపున సభ్యులందరికీ ఐడి కార్డులు ఇవ్వాలని, ఆఫీసు భవనం నిర్మాణానికి ప్రయత్నం చేయాలని తీర్మానించారు. జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా భాస్కరరావు, జిల్లా చిన్నపత్రికల అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్, పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

నరసాపురం, ఫిబ్రవరి 22: ఇటీవల రాష్ట్రంలో పలు చోట్ల జర్నలిస్టులపై జరిగిన దాడుల్ని నిరసిస్తూ గురువారం నరసాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందించారు. అక్కడ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేశారు. డీఎస్పీ మనోహరాచారికి వినతిపత్రం ఇచ్చారు. అధ్యక్షుడు ఇజ్రాయిల్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్‌లో ఇటువంటి దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలన్నారు. కుమార్, రంగ, చిన్నారావు, సూర్యనారాయణ, రాజేష్, బాబు, రాంబాబు, ఆనందరాజు, రాము, వెంకటేశ్వరావు, శ్రీను, భగవాన్, సందీప్, సత్యనారాయణ, పండు, బాబీ, దివిసత్యన్, నాని, రమేష్, రాజు, శంకర్, బాలజీ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు...పట్టు వస్త్రాలను తెస్తున్న మంత్రి వనిత, ట్రస్టీ

రమణీయం..నారసింహుని కల్యాణం

భక్తజనసంద్రంగా సుందరగిరి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 22: మహిమాన్వితుడిగా సుందరగిరిపై విరాజిల్లుతోన్న లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవం కొండ దిగువనున్న కల్యాణమండపంలో గురువారం ఉదయం వైభవంగా జరిగింది. సుందరగిరి పరిసరాలు భక్తజనుల నృశింహ నామస్మరణలతో మారుమోగాయి. చిన వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని ఈ ఆలయంలో ముందుగా కనకవల్లీ సమేత లక్ష్మీ అమ్మవారితో నరసింహుని ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి కొండదిగువనున్న కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటిబోదెలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణవేదికపై ఉన్న సింహాసనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. హోంమంత్రి తానేటి వనిత, ట్రస్టీ ఎస్‌వీ నివృతరావు, ఈవో వేండ్ర త్రినాథరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శుభముహూర్త సమయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింప చేశారు. పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

వైభవంగా పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి సారథ్యంలో వేదాశీర్వచనం చేశారు. గురువారం సాయంత్రం హనుమద్వాహనంపై, రాత్రి సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామివారి చక్ర స్నానానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ తెలిపారు. ఆలయ ఛైర్మన్ కలిదిండి కుమార రామగోపాల రాజా బహదూర్, రాంబాబు, ఎస్ఐ రాము, దాసరి వాసు పాల్గొన్నారు.



మిలటరీ మాధవరంలో వరుణ్‌తేజ్ సందడి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: హీరో వరుణ్‌తేజ్ తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరంలో గురువారం సందడి చేశారు. ఆయన నటించిన ఆపరేషన్ వాలంటైన్ చిత్రం ప్రమోషన్ కోసం వచ్చిన వరుణ్ మాట్లాడుతూ ఈ గ్రామంలో దేశరక్షణ కోసం ప్రతీ ఇంటి నుంచి కనీసం ఒకరు పనిచేయడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించిందని తాను నటించిన ఈ చిత్రం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బ్యాగ్రౌండ్‌గా తెరకెక్కిందన్నారు. అనంతరం దేశ రక్షణలో గ్రామంలో అమరులైన వారి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన అమర వీరుల స్థూపం వద్దకు చేరుకుని సెల్యూట్ చేశారు.


అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న వరుణ్

క్రైం కార్నర్

ఆరు సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 22 : భీమవరం పట్టణం జువ్వలపాలెంలో రోడ్‌లో నిర్వహిస్తున్న గోపి పికెల్స్‌లో గురువారం తనిఖీ చేయగా ఆరు గృహ అవ సరాల గ్యాస్ (సబ్సిడీ గ్యాస్) సిలెండర్లను గుర్తించినట్లు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ తెలిపారు. తనిఖీలో రూ.16,002 విలువ కలిగిన ఆరు సిలెం డర్లు సీజ్ చేసి యజమాని నాగరాజుపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రీజనల్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి కరణం కుమార్‌కి అందిన సమాచారం మేరకు ఆయన ఆదే శాలతో దాడుల చేసినట్టు తెలిపారు.సీఎస్ ఆర్ఐ సురేష్, సిబ్బంది తెలిపారు.



బంగారం చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 22 : బంగారం చోరీపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొనకళ్ళ అచ్యుతరావు తన ఇంటిలో సూట్ కేసులో పెట్టిన 6 కాసుల బంగారపు హారం ఈనెల 12వ తేదీన కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తిపై అనుమానంతో ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. కేసు నమోదు

టి.నరసాపురం, ఫిబ్రవరి 22 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. బండివారి గూడెం గ్రామ శివార్లలో గల ఎర్రకాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో గురువారం దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

60 లీటర్ల సారా స్వాధీనం

పోలవరం, ఫిబ్రవరి 22 :పోలవరం మండలం పాత తోటగొంది గ్రామంలో గురువారం సారాతో తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలవరం పోలీస్ స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపారు. మడకం రమేశ్ పాతతోటగొంది గ్రామం నుంచి 60 లీటర్ల సారా రవాణా చేస్తుండగా అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టుకి పంపినట్లు తెలిపారు.

52 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాలకోడేరు, ఫిబ్రవరి 22 : పాలకోడేరు శివారు ఎస్ఆర్ నగర్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్ ఆదేశాలతో మల్లుల వీరాస్వామిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 52 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఎస్ఐతో పాటు సిబ్బంది హజరయ్య, నాగరాజు, దుర్గారావు, భావానిలను సీఐ అభినందించారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు

పెదపాడు, ఫిబ్రవరి 22 :రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఆ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన కాజా అప్పారావు (42) కూలి పనులతో పాటుగా ఫ్లవర్ డేకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏలూరులో ఫ్లవర్ డేకరేషన్ చేసి కుమారుడు రామ్మోహన్‌తో కలిసి మోటారుసైకిల్‌పై పెదపాడు వస్తుండగా కొత్తూరు సమీపంలో ఎదురుగా వస్తున్న బోలోరో వాహనం వీరి మోటారుసైకిల్‌తో పాటుగా మరో మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది.ఈ ఘటనలో అప్పారావుకు తీవ్రగాయాలవగా కుమారుడు రామ్మోహన్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పారావు మృతి చెందాడు. గాయాలపాలైన వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రామ్మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ కోసం విచారిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

భార్య కేసు పెట్టిందని మనస్థాపంతో ఆత్మహత్య

పెనుగొండ, ఫిబ్రవరి 22: భార్య కేసు పెట్టడంతో మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం పెనుగొండ మండలం దొంగరావి పాలెంకు చెందిన కుడిపూడి వెంకటేష్ (34) అదే గ్రామానికి చెందిన జీవనితో పదేళ్ళ క్రితం వివాహ మైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటేష్ జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. 6 నెలల క్రితం వీరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో సర్దుబాటు చేశారు. గొడవలు సద్దుమణగకపోవడంతో నెల క్రితం జీవని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె భర్తతో పాటు మరో ఇద్దరిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. దొంగరావిపాలెం వచ్చిన వెంకటేష్ మనస్తాపానికి గురై ఈ నెల 19న శానిటైజర్ తాగాడు. బంధువులు వైద్యం నిమిత్తం తణుకు ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రామారెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి డ్రైవర్ మృతి

భీమడోలు,ఫిబ్రవరి 22 : ఆర్థిక సమస్యలు తట్టుకోలేక లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యకి పురుగుమందు తాగడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం భీమడోలు గ్రామానికి చెందిన కోపల్లి కుసుయ హరనాథ వెంకట రాజు (63) ఈనెల 17న కలుపు మందు తాగడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు భార్య లూపారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : కొంతమంది తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ తీవ్ర మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకున్న వ్యక్తి తీవ్ర గాయాలకు గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరులోని కొమడవోలుకు చెందిన చలపారెడ్డి మురళీ (45) గతంలో ఆశ్రం ఆసుపత్రి జంక్షన్ వద్ద హోటల్ నిర్వహించేవాడు. ప్రస్తుతం ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. మద్యం తాగి ఆటో నడపడంతో ఆటో యూనియన్ వారు మందలించారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దంటూ హెచ్చరించి 15 రోజుల పాటు ఆటో నడపవద్దని ఆదేశించారు.దీంతో ఆశ్రం సెంటర్‌లో తిరిగి హోటల్ పెట్టుకోవడానికి ప్రయత్నించగా కొంతమంది ఆటోడ్రైవర్లు ఆ స్థలంలో ఆటోస్టాండ్ అనిబోర్డు పెట్టడంతో మనస్థాపానికి గురై ఈనెల 13న అక్కడే పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతనిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశ్నించేవారంటే జగన్‌కు భయం : తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 22: ప్రశ్నించే గళం వింటే జగన్ వణుకు పోతున్నారని పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మండిపడ్డారు. జగన్ పాలనలో మోసాలను, అవినీతిని వెలికి తీస్తున్న వార్తా పత్రికలు, న్యూస్ ఛానల్స్ జర్నలిస్టులపై జగన్ తన రౌడీ మూకలతో దాడి చేయడం సిగ్గుచేటన్నారు. సిద్ధం సభలో చొక్కాలు మడతపెట్టే పనిలో ఉండండని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడం వల్లనే దాడులకు తెగబడుతున్నారన్నారు.





తప్పుల్ని ఎత్తిచూపితే దాడులా : బండారు

నరసాపురం, ఫిబ్రవరి 22: తప్పుల్ని ఎత్తిచూపితే ప్రభుత్వం తట్టుకోలేక విలే కర్లపై దాడులు చేయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మండిపడ్డారు. జర్నలిస్టులు, మీడియా కార్యాలయాలపై వైసీపీ దాడుల్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం నిరంకుశ తత్వానికి ఈ దాడులే నిదర్శమన్నారు. సత్యనారాయణరాజు, కొండేటి శ్రీను,చాగంటి సురేష్, నరేంద్ర, హేమ, శేఖర్, నాగరాజులు పాల్గొన్నారు

పిరికిపంద చర్య : జనసేన

కుక్కునూరు, ఫిబ్రవరి 22 : జర్నలిస్టులపై దాడి పిరికిపంద చర్యని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యుగంధర్ అన్నారు.జగన్ పాలనలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని అరాచకం రాజ్యమేలుతోందన్నారు. ఎం.వెంకన్న బాబు, మంత్రి కృష్ణలక్ష్మణ్ స్వామి, వీరబాబు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

మార్చి 14 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 22 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకు అమ్మకాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 14వ తేదీ నుంచి ఎస్ఎల్ఎస్ ఏరియాలో వర్జీనియా పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. బుధవారం గుంటూరు పొగాకు ప్రధాన కార్యాలయంలో బోర్డు ప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, పొగాకు రైతు సంఘాల నాయకులు, బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వేలం కేంద్రాల ప్రారంభంపై ఒక నిర్ణయం తీసుకున్నారు.



మూడు దశల్లో కొనుగోళ్లు

ఈ ఏడాది మూడు దఫాలుగా రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి. మొదటి దశలో భాగంగా ఫిబ్రవరి 29న ఒంగోలు-1, కొండేపిలో కొనుగోళ్ల ప్రారంభమవుతాయి. రెండోదశలో మార్చి 6న కందుకూరు-1, కందుకూరు-2, వెల్లంపల్లి బోర్డు పరిధిలో, మూడోదశలో మార్చి 14 నుంచి ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, పొదిలి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యల గూడెం, జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2 బోర్డుల పరిధిలో ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో ఒక్కొక్కటి, జంగారెడ్డిగూడెంలో రెండు మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 14,600 లైసెన్స్ బ్యారన్‌లు ఉన్నాయి. 60 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది సీజన్ ప్రారంభ రోజుల్లోనే మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్జీనియా పరిధిలో పొగాకు పంట దారుణంగా దెబ్బతింది. పంటను దున్నేసి మరలా మొదటి నుంచి నాట్లు వేశారు. పెట్టుబడులతో పాటు అధిక ధరలకు నారు కొని సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగింది.

గత ఏడాది అదుర్స్

గతేడాది పొగాకు మార్కెట్ అదిరిపోయే ధరలతో మోతమోగించాయి. పొగాకు చరిత్రలోనే అనీవినీ లేని ధరలతో రికార్డులు సృష్టించాయి. వేలం ప్రక్రియ ప్రారంభం రోజు నుంచే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. రికార్డు స్థాయిలో కేజీ పొగాకు గరిష్టంగా రూ.288 నమోదై రాష్ట్రంలోనే ఆల్‌టైం రికార్డును నమోదు చేసుకుంది. పదేళ్ల క్రితం కేజీ పొగాకు రూ.200 మైలు రాయిని దాటింది. ఆ తరువాత 2019లో కేజీ ధర రూ.230 నమోదవ్వగా 2020లో కేజీ పొగాకు రూ.245 ధర పలకడంతో రికార్డుకెక్కింది. తరువాత గతేడాది రూ.288తో మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది కూడా మార్కెట్ ఆశాజనకంగా ఉండి మంచి ధరలు రావాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

సినీ ఫక్కీలో బంగారం దోపిడీ

భీమవరంలో కలకలం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 22 : భీమవరం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి బాలు షేట్‌ను తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలో పోతవరం వద్ద ఐదుగురు దుండగులు ఇంకమ్ ట్యాక్స్ అధికారులమని చెప్పి మూడున్నర కిలోల బంగారం, 5 లక్షల నగదు దోచుకెళ్ళినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన భీమవరంలో కలకలం రేపింది. మహారాష్ట్రకు చెందిన బాలు సుమారు 30 సంవత్సరాల క్రితం భీమవరం వచ్చి స్థిరపడ్డారు. ఇక్కడే ముందుగా ద్రావకం షాపు (బంగారం కరిగింపు) పెట్టి వ్యాపారాన్ని పెంచు కున్నారు. ప్రస్తుతం బంగారం హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, నర్సాపురం, పాలకొల్లు, ఏలూరు జిల్లా జంగా రెడ్డిగూడెం, ఏలూరు, కైకలూరు వంటి పట్టణాలలోని షాపులకు బంగారం విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారిని పసిగట్టిన దుండగులు వెంబడించి ఈ చోరీకి పాల్పడినట్లుగా చెబుతున్నారు.

కుమారుడి భవిష్యత్తుపై బెంగతో వృద్ధుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : తన కుమారుడి జీవితం పాడైపోయిందని మనస్థాపానికి గురై ఒక వృద్ధుడు పురుగుమందు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ఇందిరా కాలనీకి చెందిన కాసాని విశ్వేశ్వరరావు (70) కోడలు తన కుమారుని వదిలి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి అతని కుమారుడు ఒంటరిగా ఉంటున్నాడు. తన కుమారుడి జీవితం పాడైపోయిందని మనస్థాపానికి గురైన తండ్రి విశ్వేశ్వరరావు గురువారం పురుగుమందుతాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందుల షాపు సీజ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22 : నిషేధిత క్రిమి సంహారక మందులు నిల్వ ఉన్నట్లుగా జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్‌కు అందిన సమాచారంతో విజిలెన్సు అధికారులు ఒక షాపుపై దాడి చేశారు. వేలేరుపాడు మండలం వసంతవాడలో శ్రీసాయి రూప మణికంఠ ట్రేడర్స్‌పై విజిలెన్సు, రెవెన్యూ అధికారులు గురువారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. నాలుగు వేల 200 రూపాయల విలువ కల్గిన నిషేధించిన పురుగుమందులను నిల్వ ఉంచారని, 32,572 రూపా యల విలువైన 1.63 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించామ న్నారు. దీంతో ఆ షాపును సీజ్ చేసి షాపు యజమాని పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ సీఐ విల్సన్, విజిలెన్స్ ఏవో సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



రేపు ఎస్‌ఆర్‌కేఆర్ జాతీయస్థాయి సింపోజియం

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 : ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 24వ తేదీన సూపర్ నోవా 2కె24 పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టరును కళాశాల డైరెక్టర్ డా.ఎం.జగపతిరాజు విడుదల చేశారు.

వచ్చే ఏడాది డీఎన్నార్‌లో ఎల్ఎల్ఎం కోర్సు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 22 : డీఎన్నార్ లా కళాశాల 34వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. లా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె రఘురామ్ అధ్యక్షత వహించారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ న్యాయ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎల్ఎల్ఎం కోర్సును ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

గాంధీ భవనం అభివృద్ధికి విరాళం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 22: మహాత్మగాంధీ తోడు నీడ అయిన కస్తూరిబా గాంధీ 80వ వర్ధంతి శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిబా నిలయంలో గురువారం నిర్వహించారు. ముందుగా గాంధీ, కస్తూరిబా విగ్రహాలకు ఏపీ గాంధీ స్మారక నిధి ఎగ్జిక్యూటివ్ ఎస్ఎల్ఎస్ బాపిరాజు, వసుధ కార్యదర్శి ఎం. కృష్ణంరాజు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెదనింద్ర కొలను లోని గాంధీ భవనం అభివృద్ధికి ఎస్ఎల్ఎస్ బాపిరాజు రూ.2.50లక్షల విరాళాన్ని అందించారు. అనంతరం వసుధ ఫౌండేషన్ ఉచిత కుట్టు శిక్షణకు సహకరిస్తున్న రత్నమాల, దుర్గాదేవిలను సన్మానించి కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

పాలకోడేరు వాకర్స్ కార్యవర్గం

పాలకోడేరు, ఫిబ్రవరి 22: నడకే ఆరోగ్యం, నడక ద్వారా అనేక సమస్యలకు దూరంగా ఉండవచ్చునని 201 డిస్ట్రిక్ గవర్నర్ వై.సత్యనారాయణ అన్నారు. పాలకోడేరు గ్రామంలో ఎండీవో కార్యాలయం ఎదుట ఉన్న సాయిబాబా మందిరం వద్ద గురువారం వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించి ప్రమాణస్వీకారం చేయించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా గాదిరాజు కృష్ణంరాజు (బాబు), కార్యదర్శిగా ఐ.కోటేశ్వరరాజు, సహాయ కార్యదర్శిగా ప్రసాదరాజు, ఉపాధ్యక్షులుగా కె.కృష్ణంరాజు, డైరెక్టర్‌గా ఆళ్ళ నాగేశ్వరరావు, సత్యనారాయణ, జాలివాకర్, ఎ.రమణలచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో రీజనల్ కౌన్సిలర్ కె.నరసింహమూర్తి, జిల్లా సెక్రటరీ వి.నాగేంద్రప్రసాద్, గుంటూరి రామరాజు, జి.లక్ష్మణరాజు పాల్గొన్నారు.

పది పరీక్షలకు తొమ్మిది సెంటర్లు ఏర్పాటు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 2: వచ్చే నెలలో జరిగే పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పట్టణ, మండలంలో తొమ్మిది సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. ఈ సెంటర్లలో 2070 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. టేలర్ స్కూల్‌లో 190, రుస్తుంబాద స్కూల్‌లో 180, సికిలీ 210, లెనిన్ 190, గౌతమి 300, సన్‌షైన్ 180, మిషన్‌హైస్కూల్‌లో 230, సీతారాంపురం గురుకుల 320, తూర్పుతాళ్ళు హైస్కూళ్ళల్లో 270 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆమె తెలిపారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



ఆకివీడు, ఫిబ్రవరి 22: ఆకివీడు మెయిన్ సెంటర్ జాతీయ రహదారిపై ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు నిలిచి పోయింది. ఏలూరు నుంచి నర్సాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు మార్గం మధ్యలో జాతీయ రహదారిలో నిలిచిపోవడంతో బస్‌లో ఉన్న 69 మంది ప్రయాణికులను రెండు బస్సులలో ఎక్కించి పంపించారు. ఆర్టీసీ బస్సులు తరచూ సాంకేతిక లోపంతో మొరాయిస్తుండడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 22 : కుప్పనపూడి పంచాయతీలోని తాళ్ళకోడులో ఇళ్లస్థలాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్ళు నిర్మించుకోకపోతే స్థలాలు తీసేసుకుంటామని బెదిరించి, భయపెట్టి ఇళ్ళు నిర్మించుకునే విధంగా చేశారని, వారికి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రహదారులు సక్రమంగా లేవని, మురుగునీరు వెళ్ళేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేదని, దీంతో దోమలు దండెత్తుతున్నాయని, వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చెయ్యాలని అన్నారు. కాలనీలో దొంగతనాలు పెచ్చరిల్లాయని, పోలీసులు గస్తీ పెంచాలని డిమాండ్ చేశారు.

వైఎస్ షర్మిల అరెస్టు అప్రజాస్వామికం

గణపవరం, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్య పద్ధతిలో గాంధీమార్గంలో సీఎం జగన్‌కు వినతిపత్రం అందించేందుకు చలో సెక్రటేరియట్‌కి వెళ్తుండగా ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం కార్యకర్తలతో కలిసి పోలీసుల ఆంక్షల నడుమ విజయవాడ చేరుకున్నామన్నారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని వారి పక్షాన అండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల నిలబడితే చూసి సహించలేక పోలీసులతో నిర్బంధం సృష్టించారని ఆరోపించారు.

కన్నెగంటి హనుమంతు వర్ధంతి

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 22: శ్రీకృష్ణ దేవరాయ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం ఆధ్వర్యంలో గురువారం పలనాటి పుల్లరి(శిస్తు) శాసన ధిక్కార పోరాట యోధుడు కన్నెగంటి హనుమంతు 102వ వర్ధంతి పాలకొల్లులో జరిగింది. ఈ సందర్భంగా కన్నెగంటి హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'కేంద్ర పథకాలకు వైసీపీ స్టిక్కర్లు సిగ్గుచేటు'

అత్తిలి, ఫిబ్రవరి 22 : కేంద్రం పథకాలను వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్ వేసి మేమే అందిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి అన్నారు. అత్తిలి మండలం అత్తిలి, పాలి, కేఎస్ గట్టు, ఉరదాలపాలెం గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు, ఉపాధి హామీ పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని అక్కడ వేస్తున్న శిలాఫలకాలపై కేంద్ర ప్రభుత్వం పేరుకాని, మోదీ పేరు కాని, ఫొటో కాని లేదని ఆక్షేపించారు. తణుకు అసెంబ్లీ ప్రజాపోరు కన్వీనర్ కర్రి శ్రీధర్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబరు తోట త్రిమూర్తులు, రామాంజనేయులు, రామసుబ్బారెడ్డి, మల్లిడి కనికిరెడ్డి, పాల్గొన్నారు.



వేడుకగా కవలల దినోత్సవం

తణుకు, ఫిబ్రవరి 22 : తణుకు మాంటిస్సోరి స్కూలులో కవల పిల్లల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం స్కూలు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు 22 మంది కవల ద్వయమును, కవల త్రయమును ప్రత్యేకంగా అభినందించారు.

ఆసుపత్రిలో డెలివరీలు జరిగేలా చూడాలి

పాలకోడేరు, ఫిబ్రవరి 22 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పురుడులు అధిక సంఖ్యలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా వైద్యులు అందుబాటులో ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న స్టాఫ్ నర్స్ ఎస్తేరును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాత్రి సమయంలోనే ఆకస్మికంగా పరిశీలించడం జరుగుతుందని సిబ్బంది అంతా రోగులకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పీహెచ్‌సీ తనిఖీ

వీరవాసరం, ఫిబ్రవరి 22: వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భానునాయక్ గురువారం తనిఖీ చేశారు. పల్స్‌పోలియో ఏర్పాట్లకు సంబంధించి ఈ తనిఖీ చేపట్టారు. లేబర్‌రూం, వార్డు, ఫార్మసీ, లేబొరేటరీలను పరిశీలించారు. మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్‌పోలియోకు సంబంధించి సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సీ పరిధిలో 3949 మంది 0-5 వయస్సు పిల్లలకు పోలియో చుక్కలు వేసే లక్ష్యంగా నిర్ణయించారు. ఈ లక్ష్యానికి సంబంధించి సిబ్బందిని పోలియో చుక్కలు కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆకివీడు, ఫిబ్రవరి 22:రానున్న ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా కార్యాచరణ చేపట్టామని ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని సమస్యాత్మకంగా ఉన్న 139 పోలింగ్ బూత్‌ను ఆమె పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో ఎటు వంటి సమస్య లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, సీఐ కెవీవీ ఎన్ సత్యనారాయణ, ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

వీరవాసరం: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా మండలంలోని పలు పోలింగ్ స్టేషన్లను పోలీసులు అధికారులు గురువారం పరిశీలించారు. భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ సిబ్బందితో వీటిని పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి సెక్టోరల్ ఆఫీసర్, పోలీస్‌సెక్టార్ ఆఫీసర్, బిఎల్‌వోలతో ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేసనను సందర్శించారు. అక్కడ వాస్తవ పరిస్థితులను తనిఖీ చేసి మౌలిక సదుపాయాల కల్పనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు ఇచ్చారు.



ఆకివీడులో పోలింగ్ బూత్ వద్ద పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అజిత వేజెండ్ల

ఆయనతో పాటు ఎస్ఐ పి.రమేశ్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు తనిఖీ

ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 22 : దుంపగడప గ్రామం ఉప్పుటేరు వంతెన వద్ద నిర్వహిస్తున్న చెక్ పోస్టును గురువారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. ఏలూరుజిల్లా-పశ్చిమగోదావరిజిల్లాల సరిహద్దులో ఉన్న ఈ చెక్‌పోస్టు వద్ద వాహనా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు గురికాకుండా చెక్‌పోస్టులు వద్ద పకడ్బందీగా తనఖీలు నిర్వహించాలని ఆమె పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

నేడు డయల్ యువర్ ఎస్పీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 22: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రతీ శుక్రవారం 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం నిర్వహించడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ ఉదయం 11:00 గంటల నుంచి 12:00 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ అవకాశం వినియోగించుకోదలిచిన వారు 90001 10289 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా ఎస్పీకి తెలియజేయాలని తెలిపారు.







ఆకివీడులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామరాజు.. లక్ష్మీపాలెంలో ఎమ్మెల్యే రామానాయుడు పాదయాత్ర.. అత్తిలి మండలంలో ఆరిమిల్లికి దిష్టి తీస్తున్న మహిళ

'చంద్రబాబును గెలిపిస్తేనే ప్రగతి'

ఆకివీడు, ఫిబ్రవరి 22: చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందగలదని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. గురువారం 8, 7, 6 వార్డులలో టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో మట్టి పనులు చేస్తున్న కార్మికులను ఆలింగనం చేసుకొని తెలుగుదేశం చేపట్టిన సంక్షేమ పథకాలు, గతంలో ప్రజలకు చేసిన సేవలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, అధికార జిల్లా ప్రతినిధి బొర్రా సుజాత, ఇల్లాపు కృష్ణవేణి, మరియమ్మ, ఆరీఫ్ పాల్గొన్నారు.

జగన్ చెప్పేవి అబద్ధాలే..

యలమంచిలి, ఫిబ్రవరి 22: జగన్‌కు ఒక్క చాన్స్ ఇస్తేనే రాజధాని లేకుండా పోయిందని మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రమే లేకుండా చేసే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. లక్ష్మీపాలెం గ్రామంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆయన గురువారం ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చానని అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో మద్యం నిషేధం అని చెప్పి తన బ్రాండ్లతో అమ్మకాలు సాగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. జగన్ అన్ని వర్గాలను మోసం దగా చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరిమిల్లి చిన్ని, బొప్పన హరికిషోర్, బోనం నాని, కడలి గోపీ, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు తప్ప నిర్మాణాలు చేయరా ?

అత్తిలి, ఫిబ్రవరి 22 : పేదలను అణిచివేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు విశ్రమించేదే లేదని తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఉనికిలి, ఆరవల్లి, దంతుపల్లి, మంచిలి, కంచుమర్రు గ్రామాల్లో జనంలో చైతన్యం కోసం తలపెట్టిన 'రేపటికోసం పాదయాత్ర' మూడో రోజు గురువారం కొనసాగింది. ఉనికిలిలో నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసి శిలాఫలకాలు వేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇప్పటివరకూ ఒక్క ఇటుక కూడా పెట్టించలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు రూ.50 లక్షల అంచనా వ్యయంతో కాంక్రీటు డ్రెయినేజీ, రూ.పది లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్టు శిలాఫలకాల్లో ఘనంగా ప్రకటించుకున్నారని.. ఇప్పటివరకు అంగుళం నిర్మాణం కూడా చేపట్టలేదని ప్రజలకు చూపించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుమ్మేటి వెంకట సుధాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బసల రామకృష్ణ, అత్తిలి పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ, టీడీపీ నాయకులు అల్లి సత్యనారాయణ, పోతునీడి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఉనికిలి గ్రామంలో అనేక మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. 'రేపటి కోసం పాదయాత్ర' నాలుగోరోజు శుక్రవారం అత్తిలి మండలం వరిగడ్డి గ్రామంలో ప్రారంభమై ఎర్రనీలిగుంట, గుమ్మంపాడు, బల్లిపాడు గ్రామాల్లో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే శివ ఆర్థిక సాయం




పాలకోడేరు మండలం కొండేపూడిలో ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివ

పాలకోడేరు, ఫిబ్రవరి 22 : కొండేపూడి, రామచంద్రాపురం, కోరుకొల్లు గ్రామాలలో అనారోగ్య బాధితుల కు మాజీ ఎమ్మెల్యే శివ ఆర్థిక సాయం అందించారు. కొండేపూడి గ్రామానికి చెందిన చింతపల్లి మంగయ్య, కుంచె వెంకటరత్నం పక్షవాతంతో, పేరవల్లి స్వాతి థైరాయిడ్ సర్జరీ చేయించు కుని, పాలా సత్యవతి తదితరులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విష యాన్ని వేటుకూరి వెంకట శివరామరాజు దృష్టికి టీడీపీ నాయకులు తీసు కెళ్ళారు. దీనికి స్పందించిన శివరామరాజు వారి కుటుంబాలకు ఆర్థిక సహాయ ం అందించారు. కార్యక్రమంలో ఉండి టీడీపీ నాయకులు స్వామాజ్యం, చింతప ల్లి వెంకటేశ్వరరావు, చింతపల్లి పద్మనాభం, దొంగ నాగమణి, కోటయ్య, రాంబాబు, చింతపల్లి బాబురావు, గాదిరాజు శ్రీనివాసరాజు రవివర్మ పాల్గొన్నారు.

ఆకివీడు: వారపుసంతో ప్రాంతంలోని ఇల్లాపువీధిలో పోతురాజు చిన్న రమణకు చెందిన రేకుల షెడ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవ్వడంతో బాధితులకు గురువారం శివ స్వచ్ఛంద సంస్థ తరపున మాజీ ఎమ్మెల్యే శివ 25కేజీల బియ్యం, ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుర్రాని నాగలక్ష్మి, రాష్ట్ర రైతు నాయకుడు ఇల్లాపు అప్పారావు, బచ్చు కృష్ణ, శ్రీనివాసరెడ్డి, సాంబరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామరాజు కూడా బాధితులను పరామర్శించి 25 కేజీల బియ్యం, నగదు అందించారు.

అక్షరం జీవితాన్ని నిలుపుతుంది



తణుకు, ఫిబ్రవరి 22 : అన్నం ప్రాణం నిలబెడితే, అక్షరం జీవితాన్ని నిలుపుతు ందని రూట్స్ స్కూలు డైరెక్టర్ బేవర విద్యాకాంత్ అన్నారు. సాహితి సామ్రాజ్యం ఆధ్వర్యంలో రూట్స్ స్కూలులో సాహితి సామ్రాజ్యం ప్రథమ వార్షికోత్సవం, మాతృభాషాదినోత్స వం నిర్వహించారు. సాహితి సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడమే సాహితి సామ్రాజ్యం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మృత్యుభాష మనుగడపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ విద్యాకాంత్, ప్రైమరీ స్కూలు డైరెక్టర్ పురబి త్రిపాఠి, ప్రిన్సిపాల్ సంధ్యలను సన్మానించారు.

దోమల నివారణకు కృషి చేయాలి

తణుకు, ఫిబ్రవరి 22 : దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని బ్యాంకు కాలనీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసరాల అందజేత

తణుకు, ఫిబ్రవరి 22 : తణుకు పట్టణ పరిధిలో ఉన్న స్పందన మానసిక వికలాంగుల స్కూలు విద్యార్థులకు అవసరమైన నిత్యావర సరుకులు అందజేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఈమని రామకృష్ణ, త్రిపుర దంపతులు, వారి తల్లిదండ్రులు ఈమని సీతాపతిరావు, సుబ్బలక్ష్మి దంపతులు జ్ఞాపకార్థం రూ.15 వేల విలువైన నిత్యావసర సరుకులు, బట్టలను నిర్వాహకులు జితేంద్రకు అందజేశారు.

లారీ ఢీకొని విద్యార్థులకు గాయాలు

పెనుగొండ, ఫిబ్రవరి 22: పెనుగొండ నుంచి మార్టేరు వైపు వెళుతున్న లారీ మార్టేరు నుంచి పెనుగొండ వస్తున్న ద్విచక్రవాహన్ని ఢీ కొట్టడంతో మోటారుసైకిల్ పై ఉన్న ఇద్దరు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాలు ప్రకారం గాయాలు పాలైన వారు పెనుగొండలోని ఒక కళాశాలలో చదువుతున్నట్లు సమాచారం. క్షతగాత్రులను 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులను వివరణ కోరగా ఇంకా తమకు ఆసుపత్రి నుంచి సమాచారం రాలేదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్తూరు, ఫిబ్రవరి 22: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని మూడు సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ వి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు, కాళీపట్నం, కెపిపాలెం సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు ఉంటాయని తెలిపారు.

నరసాపురం: సీతారామపురం, రాజుగారితోట, యర్రంశెట్టివారిపాలెం మండావారిపేట, మంగలగుంటపాలెం, కొప్పర్రు, రుస్తుంబాదా, ఎల్‌బిచర్ల, పసలదీవి, తూర్పుతాళ్ళు, పిఎం లంక, వేములదీవి, బియ్యపుతిప్ప, మర్రితిప్ప, ధర్బరేవు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ సురేష్ కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ, ఆయా పోస్టులకు దరఖాస్తులు

మొగల్తూరు, ఫిబ్రవరి 22: మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మూడు అంగన్‌వాడీ సహాయకురాళ్ళ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని సీడీపీవో బి.ఊర్మిళ తెలిపారు. కాళీపట్నం పడమర వంతెన పరిధిలోని అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు బీసీ ఏ, దారతిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో జనరల్ కేటగిరికి, నరసాపురం మండలం చాగంటివారిమెరక అంగన్‌వాడీ కేంద్రంలో బీసీ బి సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైన వారు మార్చి 1వ తేదీ లోపు మొగల్తూరులోని తమ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులు అందించాలని సీడీపీవో ఒక ప్రకటనలో కోరారు.

వీరవాసరం:వీరవాసరం మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త, అంగనవాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసీడీఎస్ పీవో టీకేవీ లక్ష్మీకాంతం తెలిపారు. తలతాడతిప్ప కార్యకర్త పోస్టు బీసీ-బీ కేటగిరికి, నవుడూరు జనరల్ కేటగిరికి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 23 నుంచి మార్చి ఒకటవ తేదీ వరకూ విస్సాకోడేరు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఇరగవరం: మండలంలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారం ఎంవీఎస్ ప్రమోద కుమారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేఎస్ గట్టు (ఓసీ), సూరంపూడి (ఎస్సీ), రాపాక (ఎస్సీ), పొదలడ (జనరల్) గ్రామాల్లోని అంగన్‌వాడీ పోస్టులకు స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈనెల 23 నుంచి నెలాఖరు వరకూ తణుకు పట్టణంలోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పీఎంపీల సేవలు స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న డాక్టర్ గుణసూర్య

గణపవరం, ఫిబ్ర వరి 22: వైద్య రం గం ఆధునిక వసతులతో ముందుకు సాగుతుందని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ గుణసూర్య అన్నారు. ప్రస్తుతం ఎముకలు, మోకాళ్ళు, కీళ్ల నొప్పులతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంద న్నారు. గురువారం సరిపల్లెలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎంపీల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు నిడమర్తి జయసూర్య మాట్లా డుతూ పీఎంపీల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పలు వ్యాధులపై డాక్టర్ కల్యాణ చక్రవర్తి అవగాహన కల్పించారు పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్లు, గణపవరం మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, నిమ్మల సుబ్బారావు, కే.సత్యనారాయణ, అలీ, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహంకాళమ్మ మృతి



ఉండి, ఫిబ్రవరి 22: మాజీ ఎంపిటీసీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ డైరెక్టరు కరిమెరక రామచంద్రరావుకు మాతృవియోగం జరిగింది. ఆయన తల్లి మహంకాళమ్మ(93) గురువారం ఉండి బాలాజీ రావుపేటలోని వారి నివాసంలో మృతిచెందారు. ఆమెకు నలుగురు సంతానం అందులో కరిమెరక రామచంద్రరావు ఒకరు. డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఉండి సహకార బ్యాంక్ సభ్యుడు కరిమెరక శివనాగరాజు, సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జి, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, ఎంపీపీ ఇందుకూరి శీహరినారాయణరాజు పరామర్శించారు.

శ్రీవారికి గ్రామోత్సవం



వీరవాసరం, ఫిబ్రవరి 22: నందమూరుగరువులోని శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామివారి గ్రామోత్సవాన్ని జరిపారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. వీరవాసరం, నందమూరుగరువు గ్రామాల్లో జాతీయరహదారి పై స్వామివారిని ఊరేగించారు.

రేపు కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం రూరల్ ఫిబ్రవరి 22: ఎల్‌బిచర్ల గ్రామంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ శనివారం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం పలు పూజా కార్యాక్రమాలు, హోమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఘనంగా గోగులమ్మ జాతర

తణుకు, ఫిబ్రవరి 22 : తేతలి గ్రామంలో వున్న గోగులమ్మ జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. గ్రామంలో ఇంటి ఆడపడుచులను పిలుచుకుని అమ్మవారి దర్శించుకుని, నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం రాత్రి జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సత్యనారాయణ స్వామి వ్రతం

పెనుమంట్ర, ఫిబ్రవరి 22 : గరువు గ్రామంలో బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చిటికెన నరసింహమూర్తి వెంకటలక్ష్మి దంపతులు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన మంజునాథ్ బాయిజీ ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతాన్ని జరిపించారు

కలెక్టర్‌ను కలసిన రెవెన్యూ అధికారుల సంఘం



భీమవరం, ఫిబ్రవరి 22 : పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో వీఆర్వోలు అందరూ అన్ని విధాలుగా సహకారంగా ఉంటామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్ర రాజు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుమ్మళ్ల జకరయ్య, భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ, వైస్ ప్రెసిడెంట్ తాళ్ల దానయ్య, సెక్రటరీ పంపన సురేష్, జాయింట్ సెక్రటరీ నిమ్మల రామాంజనేయులు, తాడేపల్లిగూడెం డివిజన్ సెక్రటరీ ముత్యాలు, భీమవరం మండలం ప్రెసిడెంట్ రంప రత్నం రాజు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలసిన దుర్గాప్రసాద్

భీమవరం, ఫిబ్రవరి 22 : వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్ గురువారం కలెక్టరేట్ ఛాంబరులో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ గాంధీని కలసి మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. వయవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్‌కు వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టరుకు ఆయన వివరించారు.

కళ్ళకు గంతలతో కార్మికుల నిరసన



పెనుమంట్ర, ఫిబ్రవరి 22: మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేసే కార్మికులు సమ్మె ఏడవ రోజుకి చేరుకున్నది వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురువారంనాడు నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పెనుమంట్ర మండలం సీఐటీయూ మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు

పేదలకు ఆసరాగా 'సేవా సంస్థ'

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: పేదలకు ఆసరా అందించేందుకే వల్లీమోహన్ సేవా సంస్థ ప్రారంభిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు పటాన్ వల్లి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్. అగ్రహారంలో సేవా సంస్థ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధ మహిళలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు, చీరలు అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గొల్లేరు మోహన్, గౌరవ అధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు, కోశాధికారి గజ్జల సమర్పణరావు, ఉపాధ్యక్షుడు బచ్చు దినేష్ పాల్గొన్నారు.

వాసవి కళాశాల కార్యదర్శికి సతీవియోగం



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు సతీమణి సాయి నవభారతి(70) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె మృతికి పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రత్నాకరరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ భాస్కరరాజు, డీన్ రాంబాబు, సిబ్బంది ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

గ్రంథాలయానికి వాటర్ ఫిల్టర్ బహూకరణ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: తాడేపల్లిగూడెం శాఖ గ్రంథాలయంలో పాఠకుల కోసం ఇండియన్ బ్యాంకు తరఫున బహూకరించిన వాటర్ ఫిల్టర్‌ను బ్యాంకు జోనల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకరరావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన గ్రంథాలయంలో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటుచేసే అవకాశం కల్పించిన గ్రంథాలయాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ పీఎల్ నరసింహారావు, అసిస్టెంట్ మేనేజర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దమనకాండ ఖండించాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: హరియాణాలో రైతులు తాము పండించిన పంటకు కనీస మద్దతు ధర కోసం నిరసన తెలుపుతున్న వారిపై ప్రభుత్వం చేస్తున్న దమన కాండను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు జగన్నాథపురంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులపై దాడిని సుప్రీంకోర్టు సుమోటాగా తీసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంచాల సత్తిపండు, నీలం సత్తిబాబు, జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష అమ్మవంటిది

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 22: మాతృభాష అమ్మవంటిదని, మనం ఇతర భాషలను ప్రేమిస్తూనే మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా వాసవి జూనియర్ కళాశాలలో తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకుడు వి.సుధాకరరావు, సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ, కళాశాల అధ్యక్షుడు నారాయణ వెంకట రామారావు, బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు మాతృభాషపై పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

చిరస్మరణీయుడు అబుల్ కలామ్

భీమవరం టౌన్, ఫిబ్రవరి 22 : స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక స్ఫూర్తినిచ్చిన మహోన్నత దేశభక్తుడు అబుల్ కలామ్ ఆజాద్ చిరస్మరణీయుడని ముస్లిం కమిటీ చైర్మన్ షేక్ రబ్బానీ అన్నారు. వీరమ్మ పార్కు పక్కన ఆజాద్ విగ్రహం వద్ద ముస్లిం కమిటీ, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెరుకువాడ రంగసాయి, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం షేక్ బాబాజీ సాహెబ్, షేక్ అన్సారీ, ఖలీల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 22: ఈనెల 23న తాడేపల్లిగూడెంలో జరిగే ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు మాదిగ కోరారు. ఈమేరకు గురువారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ఢిల్లీ కోర్టులో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ మీద మూడు రోజుల పాటు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ముందు వాదనలు జరిగాయనీ కోర్టు తీర్పును రిజర్వ్ చేయడం జరిగిందన్నారు. 30ఏళ్లగా పోరాడతున్న పోరాట ఫలితాన్ని రెండు మూడు నెలల్లో చూడబోతున్నామని అన్నారు.